వేసవిలో పశువులు జాగ్రత్త





ఎండలో కట్టేసిన పశువులు, రేకుల షెడ్‌లో కట్టేసిన పశువులు.. (ఇన్‌సెట్) ప్రసాద్, మండల పశువైద్యాధికారి

- పాలదిగుబడిపై ప్రభావం
- మృత్యువాతపడే ప్రమాదం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

సైదాపురం: నోరులేని పశువులు అనారోగ్యానికి గురైతే అవి నోరు తెరచి మనకి చెప్పలేవు. పశుపోషకులే వాటిని గుర్తించి ప్రథమ చికిత్స అందించాలి. అజాగ్రత్తలు వహిస్తే పాడినే నమ్ముకుని జీవించే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వేసవిలో పశువులకు వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వేసవిలో పశువులను నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఈకారణంగా పాడి పశువులకు గణనీయంగా పాలదిగుబడి సైతం తగ్గడంతోపాటు మృత్యువాతకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలను తీసుకోవడం ద్వారా పశువులు వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవచ్చని సైదాపురం మండల పశువైద్యాధికారి బొడ్డు ప్రసాద్ సూచించారు.

వడదెబ్బకు శరీర ప్రక్రియ మందగిస్తుంది..

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథలామస్ స్వేద గ్రంధుల నిర్వాహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతాయి. మూత్ర పిండాలు సరిగ్గా పనిచేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ తగిలిన పశువులు శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట చొంగ కారుతుంది. నీడ కోసం చెట్టుకింద చేరి కూలబడతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 103 నుంచి 109 డిగ్రీలు దాటితే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంటుంది. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో గర్భస్రావం సంభవిస్తుంది. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. వడదెబ్బ వల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలు అతిసార వ్యాధి వ్యాపించి మృత్యువాతకు గురవుతాయి.

నివారణ చర్యలు ఇలా..

వేసవిలో ఎండల్లోకి పశువులను మేతకు వదలకూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పశువులను బయటకు పంపాలి. పశువులను రోజుకు మూడు, నాలుగు సార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి.



మేతకు వెళుతున్న ఆవులు, గేదెలు

వాటిపై తరుచూ చల్లటి నీళ్లను చల్లుతుండాలి. గాలి బాగా ఆడేటట్లు ఎత్తైన పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకుల కప్పులు ఉన్న పశువుల షెడ్లపై గడ్డిని కప్పి మధ్యాహ్న వేళ్లలో నీళ్లను చల్లుతుండాలి. వడగాలుల ప్రభావం పడకుండా గోనె సంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.

చికిత్స విధానం..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు చల్లటి నీటితో కడగాలి. తడి గోనె సంచులు కప్పి చల్లుతుండాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే సమీపంలోని పశువైద్యాధికారులను సంప్రందించాలి. వేడిని తగ్గించే ఇంజెక్షన్ వేయాలి. రక్తంలో డెక్ట్రోజ్‌సైలెన్ ఎక్కించడం వల్ల శరీరానికి సరిపడా గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అంది పశువులు నీరసం నుంచి బయటపడతాయి.

క్లుప్తంగా

నేడు ఎండీఎం నిర్వాహకులకు సమీక్ష

వెంకటగిరిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులకు గురువారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు వెంకటగిరి పరిధిలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న వెంకటరమణయ్య

చిట్టమూరు(చిల్లకూరు): మండలంలో నెల కొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని మండల వైస్ ఎంపీపీ బద్దిగ వెంకటరమణయ్య ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఎత్తి వేసిన వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలోని సమస్యలను ఆయా పంచాయతీల ప్రజాప్రతినిదులు, ఎంపీటీసీలు వినతుల రూపంలో అందిస్తే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు కృషిచేస్తారని అన్నారు. వైస్ ఎంపీపీ రత్నమ్మ, జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, ఈఓపీఆర్డీ మనోహర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ

పెళ్లకూరు: ఉపాధి పనుల నిర్వహణలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నెలబల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడం వల్ల ఉపాధి పనులను అన్ని ప్రాంతాల్లో కల్పించి వలసలు నివారించేందుకు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

1న హనుమజ్జయంతి వేడుకలు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలోని క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి జూన్ 1న హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామివారి మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ, 10.30కి ఆకుపూజ, సాయంత్రం తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహం కొలువుదీర్చి పెంచలకోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

తడ: వేసవి సెలవులు ముగిసి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మండలంలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం తడలో పర్యటించిన ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మల్లికార్జునరావు, కార్యాలయ సిబ్బంది షణ్ముఖి, సీఆర్‌పీలు బాలాజీ, గోపినాథ్, బాలరాజు, మునేష్, మునస్వామి పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశం

గూడూరురూరల్: గూడూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎలాంటి ఆర్థికపరమైన అంశాలు చర్చకు రాకపోవడంతో సాదాసీదాగా నిర్వహించాల్సి వచ్చింది. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బూదరు గురవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా ఆర్థికపరమైన అంశాలను చర్చలోకి తీసుకోకుండా సాధారణ సమస్యలపై చర్చించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే వైద్యాధికారులు పల్లెల్లో విష జ్వరాలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యాశాఖాధికారులు పాఠశాలలోని మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే పలు శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్‌రావు, వైస్ ఎంపీపీలు ఎం.శ్రీనివాసులరెడ్డి, ఇంద్రాణి పాల్గొన్నారు.

కనులపండువగా కరిమాణిక్యస్వామి వసంతోత్సవం



సప్పరంలో ఊరేగిస్తూ స్వామికి వసంతోత్సవ పూజలు



స్వామివారికి చక్రస్నానం, అభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులోని శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి వసంతోత్సవం కనులపండువగా జరిగింది. ఇందులోభాగంగా ప్రత్యేకంగా అలంకరించిన సప్పరంపై స్వామివారు కొలువుదీరి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ వేదపండితులు వసంతాలు చల్లుతూ కోలహలంగా నిర్వహించారు. అనంతరం దేవదేవేరులకు ఆలయం వద్ద చక్రస్నానం నిర్వహించారు. ఉదయం నుంచి సుప్రభాత సేవ, ఆరాధన. సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఉయ్యాల సేవ, ఏకాంతసేవ నిర్వహించారు.

నేడు పుష్పయాగ పూజలు..

బ్రహోత్సవాల్లో చివరి రోజు గురువారం సాయంత్రం ఆలయం వద్ద స్వామి, అమ్మవార్లకు పుష్పయాగ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. ఉదయం స్వామివార్ల అభిషేక వేడుకలతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

కమనీయం..కల్యాణం

వాకాడు: మండలంలోని అందలమాల గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. అందులోభాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్ల అభిషేకం, కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణం వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త భూదేవమ్మ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో బుధవారం నియోజవర్గంలోని వైఎస్సార్‌సీపీ ఏజెంట్లతో సమీక్షించారు. నేదురుమల్లి మాట్లాడుతూ కౌంటింగ్ హాల్‌లో ఎన్నికల అధికారుల నియమావళిని తప్పనిసరిగా అనుసరించాలన్నారు. అదేవిధంగా కౌంటింగ్ జరుగుతున్న సరళిని పరిశీలిస్తూ ఓటింగ్ శాతం వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలురాళ్లే ఆ గ్రామాలకు బస్టాప్‌లు



10వ మైలురాయి



11వ మైలురాయి

సైదాపురం: మైలురాళ్లే ఆ గ్రామాలకు బస్టాప్‌లు..ఆ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ కండక్టర్లు కూడా ముందుగా ఆ మైలురాయిల విషయాలను తెలుసుకుని డ్యూటీ ఎక్కుతుంటారు. తొమ్మిదో మైలుకు టికెట్ ఇవ్వండి సారూ...మరొక్కరు పదో మైలుకు టికెట్ ఇవ్వండి అంటుండగా మరొకరు నాకు 11వ మైలుకు టికెట్ ఇవ్వండి అంటూ కండక్టర్లను టికెట్లు అడుగుతుంటారు ఆప్రాంతంలో..ఆ మైలురాళ్ల పేర్లు చెపితే కండక్టర్‌కు ఏ గ్రామానికి టికెట్ ఇవ్వాలో టక్కున ఇచ్చేయడం ఆనవాయితీ మరీ....ఆరే వింతగా ఉందిగా..చూద్దాం రండి..ఈసంఘటనలు ఎక్కడో కాదంది సైదాపురం మండలంలో జరుగుతున్నాయి. మండలంలో గూడూరు, రాపూరు నుంచి రాపూరు డిపో బస్సులు ఎక్కితే ఈసంఘటనలు చూడొచ్చు..సైదాపురం నుంచి చాగణం వరకు ఉన్న మార్గంలో ఉన్న ఊరు పేర్లకు బదులుగా మైలురాళ్ల దర్శనమిస్తుంటాయి. గూడూరు నుంచి రాగనరామాపురం గ్రామానికి బస్సు టికెట్ అడిగే వారు 9వ మైలురాయి టికెట్ ఇవ్వండి అంటుంటారు. అలాగే తిప్పిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే ప్రయాణికులు 10వ మైలురాయి, చాగణంరాజుపాళెం రోడ్డు వద్ద దిగే ప్రయాణికులు 11వ మైలురాయి టికెట్‌ను అడిగే ఆనవాయితీ నేటికీ కనపడుతుంటాయి. ఆరే ఊరి పేర్లు చెప్పకుండానే మైలురాళ్ల పేరుతో టికెట్ అడుగుతుంటారాని ఆశ్చర్యపోయ్యేవారికి ఈవిషయాలు ఏమి తెలియవు. బ్రిటిషు వారు వేసిన ఆ మైళ్లరాళ్లు నేటికీ దర్శనమిస్తున్నాయి మరీ.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

గూడూరురూరల్: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అల్లూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు గెలిచి ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహానుబావుడు జక్కా వెంకయ్య అని పలువురు సీపీఎం నాయకులు కొనియాడారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా సంతాప కార్యక్రమం ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, పామంజి మణి, సీఐటీయూ నేతలు బీవీ రమణయ్య, ఎస్ సురేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

సూళ్లూరుపేట రూరల్: స్థానిక మండల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు స్థానిక బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు శ్రీనివాసులురెడ్డి, శ్రీనయ్య బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కాగానే మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం నిర్వాహకులకు పలు రకాల ఆహార పదార్థాల వంటకాలపై పోటీలు నిర్వహించారు. సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కండలేరులో 6.650 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 6.650 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన ఈసందర్భంగా పేర్కొన్నారు.

భవిత కేంద్రాల్లో మంచి సౌకర్యాలు



భవిత కేంద్రంలో బాలుడితో చంద్రశేఖర్‌రెడ్డి

తడ: భవిత కేంద్రాల్లో ప్రత్యేక ప్రతిభావంతులైన చిన్నారులకు మంచి సౌకర్యాలు ఉన్నాయని తిరుపతి జిల్లా సమగ్ర ఐ.ఈ.కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తడ కండ్రిగ భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అదేవిధంగా అక్కంపేట, చేనిగుంట, మాంబట్టు గ్రామాల్లోని ఐఈఆర్‌టీలు చేస్తున్న సర్వేలను తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనిఖీల సందర్భంగా ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడంతోపాటు ఫిజియోథెరపీ చేయించడం, ఇతర అలవెన్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పిల్లలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, షూలు అందిస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఈఐఆర్‌టీలు కల్పన, ప్రియాంక పాల్గొన్నారు.

సూచనలతో సాగు చేస్తే అధిక దిగుబడులు



రైతులకు భూసార పరీక్ష నమూనా పత్రాలను అందజేస్తున్న సిబ్బంది



హాజరైన రైతులు

దక్కిలి: రైతులు అధికారుల సూచనల మేరకు పంటలను సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గోవిందరాజులు పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపల్లిలో రైతు సదస్సు, ఉద్యాన ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు గ్రామాల్లో నాణ్యమైన దిగుబడులతో పంటలు సాగుచేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. వ్యవసాయ భూముల్లో భూసార మట్టి నమూనా పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేయాలన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు భూసార పరీక్ష నమూనా పత్రాలు అందజేశారు. కేబీఎస్ ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ వీరన్నగౌడ్, కళాశాల సిబ్బంది సుస్మల, అఖిల్‌బాబు, కేవీకే శాస్త్రవేత్తలు తిరుపాల్, రాజీవన, విజయశ్రీ, నాగార్జునరెడ్డి, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచండి



క్షేత్ర సహాయకులతో మాట్లాడుతున్న ఏపీఓ

చిల్లకూరు: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచేలా క్షేత్ర సహాయకులు చర్యలు తీసుకోవాలని ఏపీఓ గిరిబాబు ఆదేశించారు. మండల ఉపాధి కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలు అధిక ఎండల కారణంగా పనులకు రావడం లేదని, దీనిని అధిగమించేందుకు ఉదయం 5 గంటలకే పనులకు వచ్చి 9 గంటల్లోగా పనులు ముగించుకుని వెళ్లేలా చూడాలన్నారు. అనంతరం పలు రిజిస్టర్లను యాన పరిశీలించారు. కార్యక్రమంలో జేఈ మల్లికార్జున్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఈసీ పాల్గొన్నారు.

గ్రామాల్లో తీరిన దాహం

- పకడ్బందీగా జలజీవన్ మిషన్ అమలు
- ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు
- నియోజకవర్గంలో రూ.52.60 కోట్లతో పనులు



మిట్టవడ్డిపల్లిలో పూర్తయిన మంచి నీటి ట్యాంకు

- రూ.11.86 కోట్లతో డక్కిలిలో 47 ట్యాంకుల నిర్మాణం
- రూ.11.50 కోట్లతో సైదాపురంలో 12 ట్యాంకులు, పైప్‌లైన్ ఏర్పాటు
- రూ.6.49 కోట్లతో కలువాయిలో 10 ట్యాంకులు, పైప్‌లైన్
- రూ.2.5 కోట్లతో రాపూరులో 14 ట్యాంకులు
- రూ.11.50 కోట్లతో వెంకటగిరిలో 47 ట్యాంకుల ఏర్పాటు
- రూ.8.75 కోట్లతో బాలాయపల్లిలో 33 ట్యాంకుల నిర్మాణం
- ఒక్కో ట్యాంకు సామర్థ్యం 40 వేల లీటర్లు



సైదాపురం మండలంలోని ట్యాంకులు



రాపూరు మండలంలో నిర్మించిన ట్యాంకులు

దక్కిలి/సైదాపురం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో మంచినీటి పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడంతో తాగునీటి కటకట ఉండేది. మహిళలు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వచ్చేది. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియక గంటల తరబడి బోర్ల వద్ద వేచి ఉండాల్సిన దుస్థితి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ఏ గ్రామంలోనూ తాగునీటితో ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంకటగిరి నియోజకవర్గానికి రూ.52.60 కోట్లు మంజూరు చేసి ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. డక్కిలి మండలంలో రూ.11.86 కోట్లతో 47 ట్యాంకుల నిర్మాణానికి ఉత్తర్వులు ఇచ్చారు. వాటిలో రూ.1.92 కోట్లతో 14 ట్యాంకులు నిర్మించారు. మిగిలినవి కూడా పనులు జరుగుతున్నాయి. బాలాయపల్లి మండలానికి 33 ట్యాంకులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచారు. ఎన్నికలు రావడంతో ఆగిపోయాయి. కోడ్ ముగిసిన తర్వాత పనులు మొదలు పెడతామని అధికారులు చెబుతున్నారు. అలాగే వెంకటగిరిలో 47 ట్యాంకులు మంజూరయ్యాయి. వాటికి రూ.11.50 కోట్లు విడుదల చేశారు. అందులో నాలుగు ట్యాంకుల నిర్మాణం పూర్తయింది. మిగిలిన వాటిలో కొన్ని నిర్మాణ దశలోనూ, మరికొన్ని టెండర్ల దశలోనూ ఉన్నాయి. సైదాపురంలో రూ.11.50 కోట్లతో 12 ట్యాంకులు, పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కలువాయిలో రూ.6.49 కోట్లతో 10 ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మిస్తున్నారు. రాపూరులో రూ.2.5 కోట్లతో 14 మంచినీటి ట్యాంకులు నిర్మించారు. అన్ని పనులూ పూర్తయితే వెంకటగిరి నియోజకవర్గంలో మరో 20 ఏళ్ల వరకు తాగునీటి సమస్య ఏర్పడదని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

చక్రస్నానం..పులకించిన భక్తజనం

- శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం ఉదయం పద్మసరస్సులో చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. అశేష భక్తులు ఇదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు. వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కై ంకర్యాలను నిర్వహించారు. ఎనిమిది గంటలకు పల్లకిపై స్వామివారు మాడ వీధుల్లో విహరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు చక్రత్తాళ్వార్‌తో కలిసి ఊరేగింపుగా పద్మ సరస్సు వద్దకు చేరుకున్నారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ చక్రత్తాళ్వార్, దేవదేవరులకు పాలు, పెరుగు, తేనె తదితరాల సుగంధ దవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. 10.45 గంటలకు పద్మసరస్సులోని జలాలకు సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి, చక్రత్తాళ్వార్‌కు అవభృథస్నానం చేయించారు. ఇదే సమయంలో భక్తులు సరస్సులో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను నిర్వహించారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

సాయంత్రం 7 గంటలకు విష్వక్సేనుడితో కలిసి స్వామి, అమ్మవార్లు మాడవీధి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అంకురార్పణ సందర్భంగా ఆవాహనం చేసిన దిక్పాలకులకు ఉద్వాసన కార్యక్రమాన్ని పూర్తి చేసి, గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభం నుంచి అవరోహణం చేయించడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించిన అర్చకులకు ఆలయ మర్యాదలు చేశారు.